


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
21 జూన్ 2024
పేజీలు: 02



## నేడే అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రతి ఏటా జూన్ 21న యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు యోగా ప్రాముఖ్యత ప్రపంచ వ్యాప్తంగా అందరికీ తెలిసింది. ఎందుకంటే యోగాసనాలు చేస్తే.. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. అంతేకాకుండా మానసిక ప్రశాంతత, మనస్సు చురుకుగా ఉంటుంది. ఇప్పుడు ఎక్కువగా జిమ్, వర్కౌట్స్ కంటే యోగాసనాలపైనే ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. యోగా వ్యక్తులను శారీరకంగా, మానసికంగా దృఢంగా మార్చడంలో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.

### 'యోగా' అంటే అర్థం తెలుసా?

'యోగా' అనే పదం సంస్కృతం నుంచి పుట్టింది. అప్పట్లో దీనిని 'యుజ్' అనేవారు. కాలక్రమేణా ఇది 'యోగా'గా మారింది. దీనర్థం ఏకం చేయడం లేదా ఒకే దగ్గరకు చేర్చడం. అంటే మనసు, శరీరాన్ని ఏకం చేసి ఆరోగ్యాన్ని అందించే సాధనం. బరువులు ఎత్తకుండా, పరుగులు పెట్టకుండా చేసే వ్యాయామం. యోగా ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని, జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రపంచానికి చెప్పడమే దీని ఉద్దేశం. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం.



## ప్రారంభమైన ఏపీ అసెంబ్లీ.. ఎమ్మెల్యేలుగా చంద్రబాబు, పవన్ ప్రమాణస్వీకారం

ఏపీలో శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత ప్రమాణం చేశారు. చంద్రబాబు శపథం నెరవేరిన వేళ.. సగర్వంగా గౌరవ సభలోకి.. ఏపీ సీఎం చంద్రబాబు రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వైకాపా నేతలు తీవ్రంగా కించపరడంతో సీఎంగానే మళ్లీ అడుగుపెడతానని 2021లో ఆయన శపథం చేశారు. అది నేడు నెరవేరింది. సమావేశాల ప్రారంభం నేపథ్యంలో అసెంబ్లీకి చంద్రబాబు వచ్చారు. తొలుత అక్కడి మెట్ల వద్ద ప్రణమిల్లి లోపలికి అడుగుపెట్టారు. అనంతరం శాసనసభాపక్ష నేత కార్యాలయంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. తన సతీమణి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అసెంబ్లీలో అప్పటి మంత్రి అంబటి రాంబాబు మాట్లాడటం, దానికి కొందరు వైకాపా సభ్యులు వంతపాడటం, సభా నాయకుడిగా వారించాల్సిన అప్పటి సీఎం జగన్ వెకిలి నవ్వులతో వారిని ప్రోత్సహించడంతో చంద్రబాబు ఆరోజు తీవ్ర మనస్తాపం చెందారు.

**గతంలో చంద్రబాబు చేసిన శపథమిదీ..**

"ఇన్నేళ్లూ పరువు కోసం బతికాను. అలాంటిది ఈ రోజు సభలో నా భార్య ప్రస్తావన తెచ్చి అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ. ఇలాంటి సభలో నేనుండను. మళ్లీ ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగుపెడతాను. లేకపోతే నాకు రాజకీయాలే వద్దు. మీ అందరికీ ఓ నమస్కారం" అని 2021 నవంబరు 19న శాసనసభలో చంద్రబాబు తీవ్ర అవమానభారంతో భీషణ ప్రతిజ్ఞ చేశారు. ఆ రోజు నుంచీ ఆయన అసెంబ్లీ సమావేశాలకు వెళ్లలేదు. ప్రజాక్షేత్రంలోనే వైకాపాపై బదులు తీర్చుకుని, ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగు పెట్టారు.

**తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టిన పవన్, లోకేష్**

ఇవాళ్టి నుంచి రెండ్రోజులపాటు ఏపీ అసెంబ్లీ సమావేశమవుతోంది. సభ్యులతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణం చేయిస్తారు. ఇక శనివారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. శాసనసభలో టీడీపీకి 135 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. జనసేనకు 21, బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వైసీపీకి 11 మంది సభ్యులు ఉన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోవడంతో సాధారణ ఎమ్మెల్యేలతో పాటు ప్రమాణం చేయనున్నారు వైసీపీ అధినేత జగన్.





# యోగా సాధనతో సకారాత్మక ఆలోచనలు

## ప్రధాని నరేంద్ర మోడీ

ప్రపంచ యోగా గురుగా భారత్ మారిందని ప్రధాని మోదీ అన్నారు. యోగా ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతున్నదని చెప్పారు. యోగా సాధన వల్ల సకారాత్మక ఆలోచనలు వస్తాయని తెలిపారు. యోగా, ధ్యానంతో మన ఏకాగ్రత పెరుగుతుందన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఒడ్డున ఉన్న షేర్-ఏ-కశ్మీర్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద జరిగిన అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో 50 వేల మంది పాల్గొన్నారన్నారు. శ్రీనగర్‌లో ఒక శక్తి ఉందని, యోగా ద్వారా దానిని మరింత పెంచుకోవచ్చని తెలిపారు. గత పదేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. 2014లో తొలిసారి తాను అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించానన్నారు. భారతదేశ ప్రతిపాదనకు 177 దేశాలు మద్దతిచ్చాయని చెప్పారు. ఇదొక రికార్డు అని తెలిపారు. అప్పటి నుంచి యోగా దినోత్సవం సరికొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉందన్నారు. విదేశాల్లో యోగా చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని వెల్లడించారు. యోగా నేర్పేందుకు వందల సంఖ్యలో సంస్థలు వెలిశాయన్నారు. జర్మనీలో ప్రస్తుతం కోటిన్నరమంది నిత్యం యోగా చేస్తున్నారని తెలిపారు. యోగా నేర్పే మహిళకు పద్మశ్రీ పురస్కారం కూడా దక్కిందన్నారు. మన దేశంలోని అనేక వర్సిటీలు యోగా కోర్సులు ప్రారంభించాయని చెప్పారు. యోగా.. ఇవాళ కోట్లమందికి దైనందిన కార్యక్రమైంది. యోగా ప్రాముఖ్యతను అనేక దేశాల నేతలు తనను అడిగారని వెల్లడించారు. యోగా వల్ల శారీరకంగా, మానసికంగా మార్పులు వస్తాయన్నారు. నేడు పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని కోరుతున్నానని చెప్పారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచం నలుమూలలా యోగా చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

కశ్మీరీ ప్రజలతో మోదీ సందడి.. సెల్ఫీ ఫొటోలు షేర్ చేసిన ప్రధాని

ప్రధాని నరేంద్ర మోదీ శ్రీనగర్‌లోని డాల్ సరస్సు సమీపాన నిర్వహించిన 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కశ్మీర్ ప్రజలతో యోగా చేశారు.విదేశాల్లోనూ యోగా చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ప్రధాని ఈ సందర్భంగా తెలిపారు. పదేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపిన మోదీ, 2015లో తొలిసారి యోగా గురించి ప్రస్తావించాక మార్పు మొదలైందని తెలిపారు. యోగా నేర్పేందుకు వందల సంఖ్యలో సంస్థలు వెలిశాయన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన 101 ఏళ్ల మహిళా యోగా గురును ఈ ఏడాది పద్మశ్రీతో సత్కరించినట్లు మోదీ తెలిపారు. ఆమె ఎప్పుడూ భారత్‌కు రాకపోయినప్పటికీ.. యోగాపై అవగాహన కల్పించడం కోసం తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. ఇదిలా ఉంటే ఈ కార్యక్రమం తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి హాజరైన కొందరితో సరదాగా ముచ్చటించారు. వారితో కలిసి సెల్ఫీలకు పోజులిచ్చారు. ఈ సందర్భంగా కశ్మీర్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. నిజానికి ప్రధాని ఏడు వేల మందితో కలిసి ఆసనాలు వేయాల్సి ఉండగా వర్షం కారణంగా అప్పటికప్పుడు వేదికను షేర్-ఏ-కశ్మీర్ సమావేశ కేంద్రానికి మార్చారు. యోగాసనాలు వేసిన అనంతరం ప్రధాని ప్రజలతో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను స్వయంగా ఆయన ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. ఈ ఫొటోలతో పాటు.. 'శ్రీనగర్‌లో యోగాసనాలు వేసిన తర్వాత దిగిన సెల్ఫీలు. డాల్ సరస్సు వద్ద అసమాన్యమైన చైతన్యం కనిపించింది' అంటూ రాసుకొచ్చారు.



## భారత మహిళా జట్టులోకి విశాఖ ప్లేయర్

దక్షిణాఫ్రికాతో జరగనున్న మిగిలిన మ్యాచులకు విశాఖకు చెందిన మహిళా క్రికెటర్ 17 ఏళ్ల షబ్నమ్ షకీల్‌కు భారత జట్టులో చోటు దక్కింది. ఈ సిరీస్‌లో ఇంకా ఒక వన్డే, టెస్టు, మూడు టీ20లు జరగాల్సి ఉంది. దీంతో ఒకేసారి 3 ఫార్మాట్లకు ఎంపికైన తొలి ఆంధ్ర క్రికెటర్‌గా షబ్నమ్ నిలిచారు. U-19 WC గెలవడంలో కీలక పాత్ర పోషించిన షబ్నమ్ డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ తరఫున ఆడారు. కాగా ఇప్పటికే జరిగిన రెండు వన్డేల్లోనూ భారత్ విజయం సాధించింది.




## అన్‌వాంటెడ్ బిజినెస్ కాల్స్‌కు చెక్!

అత్యవసరమైన పనిలో ఉండగా మన ఫోన్లకు వచ్చే అవసరం లేని ప్రమోషనల్ బిజినెస్ కాల్స్, సందేశాలు చికాకు తెప్పిస్తుంటాయి. ఒక్కోసారి విపరీతమైన కోపానికి కూడా దారితీస్తుంది. ఇలాంటి ఫోన్లు, మెసేజ్‌లకు త్వరలో చెక్ పడనున్నది. వీటి కట్టడికి సంబంధించి కేంద్ర వినియోగదారు వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం ముసాయిదా మార్గదర్శకాలు జారీచేసింది. ఈ నిబంధనలపై జూలై 21న ప్రజలు అభిప్రాయాలు తెలియజేసేందుకు అవకాశం కల్పించింది.

## కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

రైతులకు మేలు జరుగుతుందని కామెంట్స్

మాజీ స్పీకర్, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లు పూర్తైన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడింది. జరుగుతున్న పరిణామాలూ చూసిన తర్వాత నిర్ణయం తీసుకున్నాం. రేవంత్ రెడ్డినే తానే ఆహ్వానించినట్టు పేర్కొన్నారు. రైతు బిడ్డగా ఆయన సంస్కరణలు నచ్చే పార్టీలో చేరాను. మంచి పనులకు అండగా ఉండి రైతు బాగుపడాలని ఆకాంక్షతో రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాం.

**రైతు సంక్షేమం కోసం అందరిని కలుపుకుని పోతాం: రేవంత్ రెడ్డి**

పార్టీలో చేరికల అనంతరం మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అండగా పెద్దలు నిలబడాలని కోరినట్టు వెల్లడించారు. తెలంగాణ



రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. "రైతుల సంక్షేమంపై వారి సలహాలు సూచనలు తీసుకుని ముందుకెళతాం. భవిష్యత్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం ఇస్తాం. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటాం. ఇది రైతు రాజ్యం.. రైతు సంక్షేమ రాజ్యం.. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకుని పోతాం." అని రేవంత్ కామెంట్స్ చేశారు.

## జయశంకర్ సేవలు మరవలేనివి: కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలు మరవలేనివని బీఆర్ఎస్ చీఫ్ స్మరించుకున్నారు. BRS పదేళ్ల పాలనలో ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి ఇమిడి ఉందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఆత్మగౌరవం, అభివృద్ధిపై దృష్టి సారిస్తూ ఈ స్ఫూర్తిని కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





## కల్తీ సారా.. 49కి చేరిన మృతుల సంఖ్య



తమిళనాడు కళ్లకురిచ్చి జిల్లా కరుణాపురంలో కల్తీ మద్యం తాగిన ఘటనలో మృతుల సంఖ్య 49కి చేరింది. సేలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందారు. ప్రస్తుతం 120 మంది కళ్లకురిచ్చి, సేలం, పుదుచ్చేరి జిప్‌మార్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలను గురువారం మంత్రి ఉదయనిధి స్టాలిన్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ అధ్యక్షుడు అన్నామలై స్వయంగా పరామర్శించారు.

## బ్లాక్ డ్రెస్సులో ఆశ పెడుతున్న అషికా

శాండల్ వుడ్ హీరోయిన్ ఆషికా రంగనాథ్ కూడా బోల్డ్ ఫోటో షూట్ తో హల్ చల్ చేస్తోంది. పైగా గ్లామర్ ఫోటోలు కూడా దిగుతున్నారు. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో సరైన హిట్ లేకపోవడంతో తన శృంగార భంగిమలతో ఫోటోలతో కుర్రాళ్ల చూపులకు వల వేస్తోంది.దర్శకుడు మహేష్ బాబు తపనలో ఆషిక రంగనాథ్ సూపర్ కూల్ లుక్ చూడండి. ఆకర్షణీయమైన దుస్తులు కూడా. మోడ్రన్ డ్రెస్ లో కూడా సూపర్ గా కనిపిస్తోంది. ఆషిక చీరలో కూడా మెరిసిపోయింది. అలా ప్రత్యేకంగా ఉండే ఈరో ఆషికా రంగనాథ్ తరచూ కొత్త తరహా ఫోటో షూట్ చేస్తుంటుంది.ప్రస్తుతం ఆషికా రంగనాథ్ బ్లాక్ కాస్ట్యూమ్‌లో ఉంది. ఆమె చేసిన ఈ ఫోటో షూట్ కాన్సెప్ట్ ఖచ్చితంగా గ్లామరస్‌గా ఉంటుంది. అందుకే ఆషికా రంగనాథ్ ఇక్కడ చాలా ఆకర్షణీయంగా, కనిపిస్తూ అదిరిపోయే పోజులు ఇచ్చింది.ఇక్కడ ఆషికా రంగనాథ్ ఒకే కుర్చీలో కూర్చుని రకరకాలుగా పోజులిచ్చింది. కానీ అన్ని ఫోటోలలో ఒక సాధారణ థీమ్ ఉంది. అది మరేమీ కాదు. గ్లామర్ ఒకటే అని చెప్పవచ్చు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## కడుపునొప్పితో ఎమ్మెల్యే భార్య సూసైడ్

తెలంగాణలోని కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. అల్వాల్‌లోని ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె మృతదేహన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య సమస్యలతోనే రూపాదేవి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. తీవ్ర కడుపునొప్పి సమస్యతో రూపాదేవి కొంతకాలంగా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా స్కూల్‌కు సెలవు తీసుకుని ఇంట్లోనే ఉన్నారు. రూపాదేవి కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు.

**సూసైడ్‌కు ముందు ఎమ్మెల్యేకు భార్య వీడియో కాల్**

తెలంగాణలోని చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి మృతి చెందారు. ఆత్మహత్య చేసుకునే ముందు రూపాదేవి భర్తకు ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. గురువారం అల్వాల్ నుంచి ఎమ్మెల్యే చొప్పదండికి వెళ్లారు. సాయంత్రం ఆయనకు రూపాదేవి వీడియో కాల్ చేసి చనిపోతున్నానని చెప్పారు. ఎమ్మెల్యే ఇంటికి చేరుకునేలోపే ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి సత్యం స్పృహ తప్పి పడిపోయారు. కాగా ప్రేమ వివాహం చేసుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఓ కొడుకు, కూతురు ఉన్నారు.



## హజ్ యాత్ర.. 1000 దాటిన మరణాలు

సౌదీ అరేబియాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదైనట్లు అక్కడి వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో హజ్ యాత్రకు వెళ్లిన వారిలో వడదెబ్బ కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య 1000 దాటినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. వీరిలో అత్యధికులు ఈజిప్టు దేశస్థులే కాగా.. భారత్, పాకిస్థాన్, జోర్డాన్, ఇండోనేషియా, ఇరాన్, సెనెగల్, ట్యూనిషియాకు చెందినవారు ఉన్నట్లు సమాచారం.



## అమరావతికి కేంద్రం తీపికబురు

అమరావతికి కేంద్రం తీపికబురు చెప్పింది. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరుకు 56.53 కి.మీ. రైల్వే లైన్ కోసం భూసేకరణకు రైల్వే శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. కొత్త లైన్‌లో పెద్దాపురం, చిన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పరావూరులో 9 స్టేషన్లు నిర్మిస్తారు. వీటికి అమరావతి ప్రధాన స్టేషన్‌గా ఉండనుంది. కొత్తపేట-వడ్డమాను మధ్య కృష్ణానదిపై 3 కి.మీ. వంతెన నిర్మిస్తారు. ఇందు కోసం రూ.2,600 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.




## పవన్ కళ్యాణ్ పేషీలోకి డైనమిక్ ఆఫీసర్

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా కేరళలోని త్రిసూర్(D) కలెక్టర్ కృష్ణతేజ రానున్నారు. పరిపాలనలో తనదైన మార్క్ చూపించాలనుకుంటున్న పవన్ ఏరికోరి ఆయనను నియమించుకుంటున్నారు. కృష్ణతేజను డిప్యుటేషన్‌పై పంపాలని చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. 2015 బ్యాచ్‌కి చెందిన కృష్ణతేజది పల్నాడు(D) చిలకలూరిపేట. కేరళలో పర్యాటకాభివృద్ధి, అలప్పుజ కలెక్టర్‌గా అద్భుత పనితీరుతో కేంద్ర అవార్డులు పొందారు.

# నింద రివ్యూ

హ్యాపీడేస్, కొత్త బంగారులోకం, కుర్రాడు లాంటి సినిమాలతో వరుస హిట్స్ అందుకున్న వరుణ్ సందేశ్ తర్వాత దారుణమైన డిజాస్టర్లు అందుకున్నాడు. ఇక ప్రస్తుతానికి సినిమాలకు దూరమైన ఆయన ఈ మధ్యన ఇందువదన అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆ సినిమా పెద్దగా ఆకట్టుకోలేదు. ఇప్పుడు నింద అనే సినిమాతో తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ట్రైలర్, టీజర్ తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించిన ఈ సినిమా ఎట్టకేలకు ఈ శుక్రవారం నాడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మరి ఈ సినిమా ఎలా ఉంది? అనేది ఇప్పుడు మన రివ్యూలో చూద్దాం. పెద్దాపురం తాలూకా కాండ్రకోట గ్రామంలో మంజు(మధు)ను రేప్ చేసి.. మర్డర్ చేసిన కేసులో బాలరాజు(చత్రపతి శేఖర్) జైలుకు వెళ్తాడు. ఉరిశిక్ష కూడా పడిన నేపథ్యంలో అనూహ్యంగా అతని కేసులో ఇన్వాల్వ్ అయిన లాయర్, పోస్టుమార్టం చేసిన డాక్టర్, ప్రత్యక్ష సాక్షులు అందరూ కిడ్నాప్ అవుతారు. కిడ్నాప్ చేసిన వారు ఆ కేసుకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతూ వారిని టెన్షన్ పెడుతూ ఉంటారు. బాలరాజు ఆ మర్డర్ చేయలేదు అనేది కిడ్నాప్ చేసిన వారి ఉద్దేశం. దీంతో ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అయితే అసలు నిజంగా బాలరాజు ఆ మర్డర్ చేయలేదా? అతని కోసం ఇంతమందిని ఎవరు కిడ్నాప్ చేశారు? చివరికి ఏమైంది? అనేదే సినిమా కథ. ఒక హత్య కేసులో ఎలాంటి తప్పు చేయని వారు చిక్కుకుని బలి అవడానికి సిద్ధంగా ఉండగా హీరో లేదా హీరోయిన్ వచ్చి తమ తెలివి తేటలతో కాపాడడం లాంటి లైన్ తో ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి. ఈ నింద సినిమా కూడా అందుకు అతీతం కాదు. దాదాపు అదే లైన్ తో ఈ సినిమాను కూడా తెరకెక్కించారు. అయితే దానికి ఎంచుకున్న స్క్రీన్ ప్లే ఆసక్తికరంగా రాసుకున్నారు కానీ దాన్ని రాసుకున్నంత పకడ్బందీగా తెరకెక్కించడంలో




దర్శకుడు తడబడ్డాడు. మొదటి భాగం మొదలు కావడంతోనే కిడ్నాప్ డ్రామా మొదలు పెట్టి కథలోకి తీసుకు వెళ్లడానికి చాలా సమయమే తీసుకున్నాడు. ఈ క్రమంలో కన్ఫ్యూజ్ చేస్తూనే ఇంటర్వెల్ దాకా తెచ్చేశారు. హత్యాచారం జరిగింది, అది బాలరాజు చేయలేదు కానీ ఎవరు చేశారు? అనే ప్రశ్న రేకెత్తించాడు డైరెక్టర్. అయితే సెకండ్ హాఫ్ మొదలు అయ్యాక కథను చాలా ఈజీగా ఊహించగలిగేలా ఉండడం సినిమాకి మైనస్. అంతేకాక డైలాగ్స్ కూడా ప్రేక్షకులు ముందే ఊహించేలా ఉండడం మైనస్ అనే చెప్పాలి. అయితే క్లైమాక్స్ ముందు వచ్చే ట్విస్ట్ ఊహించే విధంగానే ఉన్నా అది వచ్చినపుడు మాత్రం ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. అయితే క్లైమాక్స్ మాత్రం తెలుగు సినిమా ఎండింగ్ అనిపించలేదు. సో దానికి మనోళ్లు కాస్త కనెక్ట్ అయ్యే అవకాశాలు తక్కువే. వరుణ్ సందేశ్ తనకు అలవాటైన లవర్ బాయ్ పాత్రలను దాటి ఒక హ్యూమన్ రైట్స్ కమిషన్ అధికారిగా ఆకట్టుకున్నాడు. సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ తో ఇలాంటి పాత్రలు కూడా చేయగలను అని నిరూపించాడు. ఇక హీరోయిన్ శ్రేయా రాణి పాత్ర పరిమితమే. మధు ఫర్వాలేదు అనిపించినా.. యానీ మాత్రం అదరగొట్టింది. ఇక చత్రపతి శేఖర్, మైం మధు, తనికెళ్ల భరణి సహా ఇతర నటీనటులు తమ తమ పాత్రల పరిధి మేరకు నటించారు. టెక్నికల్ టీం విషయానికి వచ్చేసరికి సినిమాటోగ్రఫీ మీద కేర్ తీసుకుని ఉంటే బాగుండేది. ఇక రీ రికార్డింగ్ బాగానే ఉన్నా పాటలు పెద్దగా గుర్తుంచుకో దగినవి లేవు. ఎడిటింగ్ క్రిస్ప్‌గా ఉన్నా లాగ్ అనిపిస్తుంది.





## ఓటిటిలో వచ్చేసిన బాక్

కోలీవుడ్ సినిమాలో హిట్ అయిన పలు హారర్ కామెడీ థ్రిల్లర్ ఫ్రాంచైజ్ లో దర్శకుడు హీరో సుందర్ సి తెరకెక్కించే కామెడీ హారర్ డ్రామా సిరీస్ "అరణ్మనై" కూడా ఒకటి. మరి వీటిలో వరుసగా మూడు హిట్స్ తర్వాత తాను తెరకెక్కించిన నాల్గవ సినిమానే "అరణ్మనై 4". తెలుగులో "బాక్" గా రిలీజ్ కి వచ్చిన ఈ సినిమాలో మిల్క్ బ్యూటీస్ తమన్నా, రాశి ఖన్నా లు నటించారు. అయితే ఈ చిత్రం తమిళ నాట మంచి హిట్ గా నిలవగా ఇప్పుడు ఈ సినిమా పాన్ ఇండియా భాషల్లో ఓటిటి ఎంట్రీకి వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు ప్రముఖ సంస్థ డిస్నీ + హాట్ స్టార్ వారు సొంతం చేసుకోగా ఇందులో ఈ చిత్రం నేటి నుంచి స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి ఈ సినిమాని చూడాలి అనుకునేవారు అయితే హాట్ స్టార్ లో నేటి నుంచి స్ట్రీమ్ చేయవచ్చు.

## సందీప్ కిషన్ సినిమాలో రీతూ వర్మ?

యంగ్ హీరో సందీప్ కిషన్ కెరీర్ లో 30వ చిత్రం రీసెంట్ గా స్టార్ట్ చేశారు. దర్శకుడు నక్కిన త్రినాథరావు డైరెక్షన్ లో ఈ సినిమాను ప్రారంభించారు. ఏకే ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. లియోన్ జేమ్స్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ కూడా స్టార్ట్ చేశారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ గా ఎవరు నటిస్తున్నారా అనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కాగా, ఈ సినిమాలో ఓ కొత్తమ్మాయిని తీసుకోవాలని చిత్ర యూనిట్ తొలుత భావించిందట. కానీ, ఇప్పుడు ఈ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్ గా సెలెక్ట్ అయినట్లు సినీ సర్కిల్స్ లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో రీతూ వర్మ అయితే బాగుంటుందని మేకర్స్ భావించారట. సందీప్ తో పాటు రావు రమేష్ పాత్ర ఈ సినిమాలో చాలా కీలకంగా ఉండనుందట. అయితే, ఆయన పాత్రకు జోడీగా 'మన్మధుడు' ఫేం అన్షు నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇస్తే బాగుంటుందని అభిమానులు కోరుతున్నారు.



## ఆస్తికోసం.. మత్తిచ్చి స్నేహితుడిని స్త్రీగా మార్చిన యువకుడు!

**బాధితుడికి తెలియకుండానే లింగమార్పిడి శస్త్ర చికిత్స**

**ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో దారుణం**



స్నేహితుడి ఆస్తి కొట్టేయాలని భావించిన యువకుడు సినీ రచయితల ఊహకు సైతం అందని ప్లాన్ వేశాడు. వైద్యులతో కలిసి కుట్రపన్ని లింగమార్పిడి ఆపరేషన్ చేయించాడు. ఆపై పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువకుడి తండ్రిని చంపేస్తానని బెదిరించి అతడి వాటా ఆస్తిని రాయించుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనమైంది. పోలీసుల కథనం ప్రకారం.. సంజక్ గ్రామానికి చెందిన ముజాహిద్ (20), ఓంప్రకాశ్ స్నేహితులు. రెండేండ్లుగా సన్నిహితంగా మెలుగుతున్నారు. అనారోగ్యం పేరుతో ఈనెల 3న ముజాహిద్‌ను ఓంప్రకాశ్ దవాఖానకు తీసుకెళ్లాడు. అక్కడ ముజాహిద్‌కు మత్తుమందు (అనెస్థీషియా) ఇచ్చిన వైద్యులు లింగమార్పిడి ఆపరేషన్ చేసి అమ్మాయిగా మార్చేశారు. స్పృహ వచ్చాక తాను అమ్మాయిగా మారినట్టు చెప్పడంతో నిర్ఘాంతపోయానని ఓంప్రకాశ్ గుర్తుచేసుకున్నాడు. మనం పెళ్లి చేసుకుందామని, అందుకోసం లాయర్‌ను, కోర్టును కూడా సిద్ధం చేశానని ముజాహిద్‌తో ఓంప్రకాశ్ చెప్పకొచ్చాడు. "ఇప్పుడు నీ తండ్రిని కాల్చి చంపి నీ వాటాగా రావాల్సిన భూమిని తీసుకుని నా పేరుపై రాయించుకుంటాను. ఆ తర్వాత దానిని అమ్మేసి లక్నో వెళ్లిపోతాను" అని ఓంప్రకాశ్ తనను బెదిరించినట్టు ముజాహిద్ ఆరోపించాడు. ఘటన వెలుగులోకి రావడంతో మాజీ నేత శ్యాంపాల్ నేతృత్వంలోని భారతీయ కిసాన్ యూనియన్ నేతలు మెడికల్ కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. ఓం ప్రకాశ్‌తోపాటు అతడికి సహకరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనక మానవ అవయవాల అక్రమ రవాణా ముఠా ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

## విరాట్ కోహ్లీ స్వార్థపరుడు: పాక్ మాజీ క్రికెటర్




టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్వార్థపరుడని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మొహమ్మద్ హఫీజ్ ఆరోపించారు. వ్యక్తిగత రికార్డుల కోసం కోహ్లీ జట్టు ప్రయోజనాలను తాకట్టు పెడతారని చెప్పారు. '2023 వన్డే WCలో SAపై కోహ్లీ సెంచరీ కోసమే ఆడారు. ఉద్దేశపూర్వకంగా పెద్ద షాట్లు ఆడలేదు. 90లలో ఉన్నప్పుడు ఎవరైనా బంతులు వృథా చేస్తే నేను అంగీకరించను. ఎప్పుడూ జట్టు గెలుపు దిశగానే ఆలోచించాలి' అని ఆయన వ్యాఖ్యానించారు.